క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత

ఉప్పునుంతల: మండలంలోని పెద్దాపూర్‌లో మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందిన పోలమోని బొందయ్య కుటుంబాన్ని బుధవారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కొత్త రవీందర్‌రావు పరామర్శించారు. రూ. 5 వేలు నగదుతోపాటు 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. అదేవిధంగా గ్రామానికి చెందిన మొహరం కమిటీ సభ్యులు రూ. 6500లు ఆర్థికసాయం చేశారు. మొహరం కమిటీ సభ్యులు జావిద్, చిల్కేశ్వరం, శ్రీను, అనిల్, సాయికృష్ణగౌడ్, మధుయాదవ్, శ్రీధర్‌రావు, గెలువయ్య, స్కైలాబ్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ ఫలాలు



మన్ననూర్: కాంగ్రెస్‌తోనే సంక్షేమ ఫలాలు అందుతున్నాయని అమ్రాబాద్ మండల మాజీ ఎంపీపీ శ్రీనివాసులు అన్నారు. ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన ఓ ప్రత్యేక కార్యక్రమానికి హాజరైన ఆయనకు మాజీ వైస్ ఎంపీపీ సంభు శోభ వెంకటరమణ, సత్యనారాయణ, మాజీ ఉప సర్పంచ్ సుజాత పూల బొకేతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు హన్మంత్‌రెడ్డి, రహీం, రాజారాం, శివాజీ, శంకరయ్య, శ్యామ్‌సుందర్ రెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ



తిమ్మాజీపేట: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో విద్యనభ్యసిస్తున్న 226 మంది విద్యార్థినులకు బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు దుప్పట్లు పంపిణీ చేశారు. దాతలకు ప్రత్యేకాధికారి సుజాత కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జోగు ప్రదీప్, మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, విండో వైస్ చైర్మన్ రాందేవ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, రైతు సంఘం మాజీ అధ్యక్షుడు వెంకటస్వామి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వేణుగోపాల్‌గౌడ్, హుస్సేనీ, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన బాలాజీ సింగ్



చారకొండ: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నాగర్‌కర్నూల్ జిల్లా మాజీ జెడ్పీ వైస్ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ ఠాగూర్ బాలాజీ సింగ్ బుధవారం సీఎం నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కల్వకుర్తి ప్రాంతం అభివృద్ధిపై చర్చించారు.

సాగునీరు విడుదల



చారకొండ: మండల కేంద్రం సమీపంలో ఉన్న పెద్ద చెరువు నుంచి పిల్ల కాల్వల ద్వారా నీటిని బుధవారం మాజీ జెడ్పీటీసీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువు, ఆయకట్టు కింద ఉన్న ఆరుతడి పంటల సాగు కోసం నీటిని విడుదల చేసినట్లు పేర్కొన్నారు. రైతులు చెరువు నీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గణేష్ గౌడ్, నాయకులు శివ, సత్తార్, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్, కేశమోని శంకర్ గౌడ్, రవీందర్, యాదయ్య ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వెల్దండ: మండలంలోని రావిచెట్టుబావితండాకు చెందిన రాత్లవత్ కిమ్యానాయక్ అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అనంతరం పాడె మోసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఉత్సాహంగా కొత్త సంవత్సర వేడుకలు



వెల్దండ మండలం గుండాలలో..



కొల్లాపూర్‌లో నూతన సంవత్సర వేడుకల్లో యువకులు

సాక్షి, నెట్‌వర్క్: ఆంగ్ల నూతన సంవత్సర 2025 పురస్కరించుకొని బుధవారం భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చర్చిలలో ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

■ నాగర్‌కర్నూల్ మండలంలోని అన్ని గ్రామాల్లో కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయాలు, చర్చీలను ముస్తాబు చేశారు.

■ కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు.నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

■ తిమ్మాజీపేట మండలంలోని పలు దేవాలయాలకు భక్తులు తరలివచ్చారు. మండలంలోని అప్పాజీపల్లి గుట్టపై వెలసిన స్వయంభూ శ్రీలక్ష్మీ నర్సింహ్మస్వామిని స్థానికులతో పాటు చుట్టు పక్క గ్రామాల భక్తులు దర్శించుకున్నారు. నేరళ్లపల్లి, తిమ్మాజీపేట, బావాజీపల్లిలోని శివరామాంజనేయ స్వామి దేవాలయాల్లో భక్తుల రద్దీ కనిపించింది.

■ వెల్దండ మండలంలోని గుండాలలో అంబా రామలింగేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలను ముస్తాబు చేశారు. కోనేరులో పుణ్యస్నానాలను ఆచరించి శివుడికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు.

■ తాడూరు మండల కేంద్రంతో పాటు శిర్సవాడ, పాపగల్, ఎత్మతాపూర్, ఇంద్రకల్ గ్రామాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమం, సామూహిక వ్రతాలు ఆచరించారు.

■ కొల్లాపూర్‌లో మంగళవారం రాత్రి 12 గంటల తర్వాత బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ కేక్‌లు కట్ చేశారు. ఒకరికొకరు కొత్తసంవత్సరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు. పలు చర్చిల్లో న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించారు.

■ ఊర్కొండ మండలంలోని ఊర్కొండపేట పబ్బాతి ఆంజనేయ స్వామి ఆలయంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. దేవాలయ అధికారి మారుతి రావు, అర్చకులు దత్తాత్రేయ శర్మ, ప్రవీణ్ శర్మ, శ్రీను శర్మ, మహేష్, సిబ్బంది శ్రీశైలం, మహేష్ పాల్గొన్నారు.

■ చారకొండ మండల వ్యాప్తంగా కొత్త సంవత్సర వేడుకలు ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. పలుచోట్ల కుటుంబసభ్యులతో కలిసి కేక్‌లు కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇంటి ఎదుట మహిళలు ముగ్గులు వేసి రంగులు అద్దారు. సిర్సనగండ్ల సీతారామచంద్రాస్వామి దేవాలయం, గ్రామాల్లో దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

■ తెలకపల్లి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో యువకులు నృత్యాలు చేస్తూ నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మహిళలు రంగవల్లులు వేసి అలరించారు.



తాడూరులో వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు



చారకొండలో ..



తెలకపల్లిలో మిఠాయి తినిపిస్తున్న నాయకుడు



బావాజిపల్లిలో భక్తుల సందడి



తెలకపల్లిలో రంగులు అద్దుతున్న చిన్నారులు



గౌరారంలో ముగ్గు వేస్తున్న మహిళ

ఘనంగా భీమాకోరేగావ్ విజయదివస్

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బుధవారం అంబేడ్కర్ ఐడియాలాజి మిషన్ ఆధ్వర్యంలో భీమాకోరేగావ్ విజయదివస్‌ను ఘనంగా నిర్వహించారు. భీమాకోరేగాం విజయోత్సవ చరిత్రపై సభ్యులు అవగాహన కల్పించారు. కృష్ణయ్య, చంద్రయ్య, గోవర్ధన్, వెంకటస్వామి, చెన్నయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: భీమా కోరేగావ్ విజయ్ దినోత్సవాలను పాఠ్యాంశాలలో చేర్చాలని అంబేడ్కర్ యువజన సంఘం డివిజన్ అధ్యక్షుడు శ్యాంసుందర్ కోరారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీమాకోరేగావ్ శౌర్యదివస్‌ను నిర్వహించారు. మూల భారతీయులు 1818 జనవరి 1న భీమా కొరేగావ్ ప్రాంతంలో కేవలం 500 మంది మూల భారతీయ సైనికులు సుమారు 28వేల పీష్వా సైన్యంతో 12గంటల పాటు ఆహారం, నీరు లేకుండా వీరోచితంగా పోరాడి ప్రత్యర్థులను మట్టుబెట్టారన్నారు. నాయకులు శ్రీశైలం, పర్వతాలు, సూరయ్య, వెంకటస్వామి, విష్ణు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్‌లో నివాళులర్పిస్తున్న అంబేడ్కర్ ఐడియాలాజీ మిషన్ సభ్యులు

ప్రభుత్వ భూమిని రక్షించాలి

అచ్చంపేట రూరల్: పట్టణంలో సర్వే నంబర్ 293లో 4.32 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేయడంతో బుధవారం న్యాయపరమైన సలహాల కోసం మెదక్ ఎంపీ రఘునందర్‌రావును హైదరాబాద్‌లో అచ్చంపేట ప్రాంత బీజేపీ నాయకులు కలిశారు. రూ. 50 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతుంటే అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఎంపీకి వివరించారు. గతంలో బీజేపీ ఆధ్వర్యంలో ఇల్లులేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆ సర్వేనంబర్‌లో గుడిసెలు వేసేందుకు యత్నిస్తే గత పాలకులు అడ్డుకున్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ భూమిని కబ్జాచేసుకుని దర్జాగా చదును చేస్తున్నా పాలకులు పట్టించుకోకపోవడంతో అనుమానాలకు తావిస్తోందని తెలిపారు. స్పందించిన ఎంపీ అవసరమైన న్యాయ సలహాలు, ఇతర విషయాల్లో ప్రజల తరుపున ఉండి ప్రభుత్వ భూమిని కాపాడటంలో ముందుంటానని హామీ ఇచ్చినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. నాయకులు మంగ్యానాయక్, బాలాజీ, నాగరాజు, జానకి, సైదులు, రవీందర్ ఉన్నారు.



ఎంపీ రఘునందన్‌రావుకు వివరాలు తెలుపుతున్న బీజేపీ నాయకులు

వాహనాల తనిఖీలు

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని ప్రధాన కూడళ్లలో మంగళవారం అర్ధరాత్రి పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీలు నిర్వహించారు. ఆరుమంది డ్రెంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డట్లు సీఐ నాగార్జున తెలిపారు. వారిపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశారు. ఎస్‌ఐ మాధవరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లింగాల: మండల కేంద్రంలో నూతన సంవత్సరం పురస్కరించుకొని మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పెట్రోలింగ్ నిర్వహించారు.



లింగాలలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఉపాధ్యాయుడిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

వీపనగండ్ల: ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ ప్రభుత్వ పాఠశాలలో గెజిటెడ్ హెడ్‌మాస్టర్ రాములుపై విద్యార్థి తల్లిదండ్రులు అకారణంగా దాడి చేశారని, అందుకు నిరసనగా మండల కేంద్రంలో వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అయ్యప్పమాలతో వచ్చిన విద్యార్థినిని చదువులో వెనకబడ్డావని మందలించడంతో ఆ విద్యార్థి తల్లిదండ్రులు మరుసటి రోజు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయుడిపై దాడి చేసి విద్యార్థి కాళ్ళు మొక్కించారని ఇది ఉపాధ్యాయుల మనోభావాలను అవమానించడమేనని అన్నారు. ఉపాధ్యాయులపై దాడి చేయడం సహించరాని నేరమని, దాడికి పాల్పడ్డ వారిని ప్రభుత్వపరంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి మురళీ, నర్సింహ, రాముడు, వెంకటేష్, సీఐటీయూ నాయకులు వెంకటేశ్వర్ల గౌడ్, నవీన్, శేషు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు నీలోత్పల్, అంబేడ్కర్ సంఘం నాయకులు సహదేవుడు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ నియామకం

ఉప్పునుంతల: మండలంలోని మామిళ్లపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి నూతన పాలకవర్గాన్ని నియమిస్తు రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు ఆలయం ఇన్‌చార్జ్ ఈఓ నర్సింహులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ పాలకవర్గం కమిటీ చైర్మన్‌గా వేముల నర్సింహ్మారావుతోపాటు కమిటీ సభ్యులుగా బుదుగం శ్రీనివాసులుగౌడ్, శ్రీమతి స్వరూప, చెలమల గణేష్, చెవ్వ కృష్ణయ్య, కనోజు ప్రదీప్ ప్రసాద్, మొల్గర వేణుగోపాల్‌రావును నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆదేశాలపై ఈనెల 9న నూతన పాలకవర్గం కమిటీతో ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహిస్తునట్లు తెలిపారు.

భూగర్భ కేంద్రం సీఈని కలిసిన నాయకులు



దోమలపెంట: భూగర్భ కేంద్రం సీఈ రామసుబ్బారెడ్డిని బీఆర్‌వీకేఎస్ రాష్ట్ర నాయకుడు రాఘవేంద్రరెడ్డి, నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జెన్‌కో యాజమాన్యం ఇచ్చిన విద్యుదుత్పత్తి టార్గెట్‌ను అధిగమించడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. రాము, తిరుపతి, శేఖర్, నాగు తదితరులు ఉన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించండి

కల్వకుర్తిరూరల్: యువతకు ఉపాధి అవకాశం కల్పించాలని తెలంగాణ టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డిని లయన్స్‌క్లబ్ కల్వకుర్తి అధ్యక్షుడు కల్మిచర్ల రమేష్ కోరారు. బుధవారం ఐక్యత కార్యాలయంలో ఆయనను కలిశారు. లయన్స్‌క్లబ్ కల్వకుర్తి గౌరవ ఉపాధ్యక్షుడిగా ఉన్న ఆయన సీఓఓగా బాధ్యతలు తీసుకున్న తర్వాత మొదటిసారి కల్వకుర్తికి రావడంతో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఐక్యత ఫౌండేషన్ లయన్స్‌క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో సామాజిక సేవలు ముందుకు తీసుకెళ్తామని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి శ్రీధర్ ఉన్నారు. రాము, తిరుపతి, శేఖర్, నాగు తదితరులు ఉన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలు నేర్పించాలి

తెలకపల్లి: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి దేవాలయంలో స్వామిజీ మాట్లాడారు. కార్పొరేట్ విద్య అని సమాజానికి ఉపయోగపడే విద్య కాదని అన్నారు. వైదిక విద్య, సైన్స్‌పై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. సంస్కృతిక సాంప్రదాయాలు నేర్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ట్రస్ట్ ద్వార పేద విద్యార్థులకు మంచి విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి ఒక్కరు భక్తిభావంతో ఆధ్యాత్మిక చింతనలో ఉండాలని మానవుని జీవితం ప్రశాంతంగా జీవించాలన్నారు. విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, బలున శ్రీరాములు, నరహరి, చోటమియా, భక్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న త్రిదండి దేవనాథ్ రామానుజ జీయర్ స్వామి

హైందవ సంస్కృతిని కాపాడుకుందాం

పెద్దకొత్తపల్లి: హైందవ సంస్కృతిని కాపాడుకుందామని త్రిదండి దేవనాథ్ రామానుజ జీయర్ స్వామి అన్నారు. బుధవారం దేవల్ తిర్మలాపూర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులు ఏకం కావాలన్నారు. ధర్మ రక్షణకోసం పాటుపడాలని సూచించారు. భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

శివాలయానికి భూమి పూజ

కొల్లాపూర్ రూరల్: మండలంలోని అమరగిరిలో వికాస తరంగిణి సంస్థ ద్వారా నిర్మిస్తున్న శివాలయానికి బుధవారం త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ప్రతిఒక్కరూ భక్తిభావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు గోవిందు, పరశురాముడు, ఈదన్న, భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

తాడూరు: ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కస్తూర్బా బాలికల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ప్రయోజకులు కావాలన్నారు. సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్స్ పంపిణీ చేశారు.



పాల్గొన్న ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి

నృసింహ సరస్వతి జయంతి



తాడూరు: మండలంలోని శిర్సవాడ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం పుష్యమాసశుద్ధ విదియ సందర్భంగా నృసింహ సరస్వతి జయంతి ఘనంగా నిర్వహించారు. పూజారి జగదీశ్వరాచారి ఆధ్వర్యంలో ఆలయంలో గురు చరిత్ర హోమం, ఉయ్యాల సేవ, యజ్ఞం తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. కార్యక్రమంలో గ్రామస్తులు వాస రమేష్, నాగలక్ష్మి, మల్లయ్య దంపతులు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడిన ట్రాక్టర్

కోడేరు: వ్యవసాయ పొలంలో కరిగెట చేస్తూ ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బావిలో పడిన ఘటన మండలంలోని నాగులపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. స్థానిక తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన తెలుగు శాంతయ్య తన వ్యవసాయ పొలంలో వరి సాగుకోసం కరిగెట చేస్తుండగా ప్రమాదవశాత్తు పక్కన ఉన్న బావిలో ట్రాక్టర్ పడింది. గమనించిన రైతులు వెంటనే డ్రైవర్‌ను బయటకు లాగారు. ట్రాక్టర్‌ను జేసీబీ సహాయంతో బయటకు తీశారు. డ్రైవర్‌కు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



వెల్దండ: మండల కేంద్రంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం మాజీ సర్పంచ్ భూపతి రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, సింగిల్‌విండో మాజీ వైస్ చైర్మన్ సంజీవ్‌కుమార్, మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్ కాసారు వెంకటయ్యముదిరాజ్, నాయకులు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణముదిరాజ్, ఎర్రశ్రీనుముదిరాజ్, కృష్ణారెడ్డి, రషీద్, నవీన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడి



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో అయ్యప్పమాలధారులు బుధవారం భక్తిశ్రద్ధలతో ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం భక్తులతో కిటకిటలాడాయి. ఇరుముడి ధరించిన స్వాములు వాహనాలలో శబరికి తరలివెళ్లారు.

మంత్రికి వినతి

వీపనగండ్ల: గ్రామాభివృద్ధికి సహకారం అందించాలని కోరుతూ బుధవారం మంత్రి జూపల్లి కృష్ణారావును కల్వరాల గ్రామస్తులు కలిసి విన్నవించారు. తమ గ్రామంలో మౌలిక వసతుల ఏర్పాటుకు సహకారాన్ని అందించాలని కోరారు. సమన్వయంతో వ్యవహరించి గ్రామాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని మంత్రిని కోరినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో చక్ర వెంకటేష్, వెంకటరాజయ్య, రమేష్‌గౌడ్, రాజయ్య, అఖిల్, వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

మరుగుదొడ్లు నిర్మించాలి



బిజినేపల్లి: పాలెం వసతి గృహాల్లో వెంటనే విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు నిర్మించాలని బీసీ జాగృతి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు బూరుగుపల్లి కృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పాలెం బీసీ బాలుర ఏ, బీ, ఎస్సీ వసతి గృహాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కృష్ణ యాదవ్ మాట్లాడుతూ వసతి గృహంలో 110 మంది విద్యార్థులు ఉన్నారని తగిన మరుగుదొడ్లు లేక కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని వాపోయారు. ప్రహరీలు లేకపోవడంతో విషపు పురుగులు సంచరిస్తున్నాయని, వసతి గృహాల స్లాబ్ పెచ్చులు ఊడిపోతున్నాయన్నారు. విద్యార్థుల కాస్మోటిక్ బిల్లు రూ.150, రూ.200 చెల్లించడం సబబు కాదని, ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా చెల్లించాలని డిమాండు చేశారు. నాయకులు వెంకటేష్, అజయ్, శివ పాల్గొన్నారు.

ఘన సన్మానం



కల్వకుర్తిరూరల్: వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అడ్మినిస్ట్రేటర్‌గా ఇటీవల బాధ్యత చేపట్టిన రమేష్‌బాబును, వైస్ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన కల్మిచర్ల రమేష్‌లను శాలువాతో సత్కరించారు. వాసవీక్లబ్ అధ్యక్షుడు లక్ష్మణస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారిని సన్మానించారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, రాఘవేందర్, కోదండరాం, రమణ, ప్రసాద్, సి రమణ తదితరులు పాల్గొన్నారు.

తండ్రి మృతితో అనాథలైన పిల్లలు



వెల్దండ: మండలంలోని రాచూర్ గ్రామానికి చెందిన చెట్ల కాశన్న(50) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం చెట్ల కాశన్నకు మొదట లింగమ్మతో వివాహమైంది. ఆమెకు నవీన్, శిరీషలు ఉన్నారు. దాదాపుగా 12ఏళ్ల క్రితం అనారోగ్యంతో లింగమ్మ మృతి చెందింది. తర్వాత యాదమ్మను రెండో వివాహం చేసుకోగా వారికి రేణుక, శివరాణి పిల్లలు ఉన్నారు. ఏడాది కిందట యాదమ్మ మృతి చెందింది. కొన్ని నెలలుగా అనారోగ్యంతో కాశన్న బాధపడుతూ బుధవారం మృతిచెందడంతో నలుగురు పిల్లలు అనాథలుగా మారారు. ప్రభుత్వపరంగా కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు, నాయకులు కోరుతున్నారు.

మండల కేంద్రంగా మార్చాలి

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని ఎంపీటీసీల ఫోరం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొట్టినేని గోపాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. గతంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో గ్రామాన్ని మండల కేంద్రంగా మారుస్తున్నారనే అంశం ముందుకు వచ్చినా, అది ఆచరణలోకి రాలేదని, ఇప్పుడైన మంత్రి జూపల్లి ప్రత్యేక చొరవ తీసుకొని గ్రామాన్ని మండల కేంద్రంగా మార్చాలని కోరారు.